క్లుప్తంగా

విధులు బహిష్కరించిన న్యాయవాదులు

నిర్మల్‌టౌన్: ఢిల్లీ న్యాయవాది వీరేంద్రకుమార్ హత్యకు నిరసనగా నిర్మల్ బార్ అసోసియేషన్ న్యాయవాదులు మంగళవారం విధులను బహిష్కరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు న్యాయవాదుల రక్షణ కోసం తక్షణమే చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నిర్మల్ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సింగారి లింగయ్య, కార్యవర్గ సభ్యులు రమణారావు, రాజేశ్వర్ రత్నం, వంశీ, న్యాయవాదులు గోవర్ధన్, లింగాగౌడ్, డి.రమణాగౌడ్, ఫసియొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

వేలం వాయిదా

భైంసా: బాసర శ్రీజ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో పండ్ల దుకాణం నిర్వహణకు అధికారులు మంగళవారం ఏర్పాటు చేసిన టెండర్ వాయిదా పడినట్లు ఈవో విజయరామారావు తెలిపారు. నిర్ణీత మొత్తంలో వేలంపాట రానందున వాయిదా వేస్తున్నట్లు పేర్కొన్నారు. మళ్లీ టెండర్ నిర్వహించే తేదీలను త్వరలోనే తెలియజేస్తామన్నారు.

పరీక్ష కేంద్రం తనిఖీ



కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న తహసీల్దార్ కలీం

కుంటాల: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల పరీక్ష కేంద్రాన్ని మంగళవారం తహసీల్దార్ ఎంఏ కలీం తనిఖీ చేశారు. 219మంది విద్యార్థులకు గాను అందరూ పరీక్షకు హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ మధుకర్ రావు, డీఓ రాజేందర్ తెలిపారు.

నేడు 'బలగం' ప్రదర్శన

కుంటాల: మండలంలోని కల్లూరులో శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ఆవరణలో బుధవారం రాత్రి ఏడు గంటలకు బలగం సినిమా ప్రదర్శిస్తున్నట్లు వైస్ ఎంపీపీ పసుల మౌనిక నవీన్, మాజీ ఉపసర్పంచ్ ప్యాట్ల రజినీకాంత్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామస్తులు వచ్చి సినిమా వీక్షించాలని వారు కోరారు.

పారిశుధ్యంపై దృష్టి సారించాలి



రికార్డులు పరిశీలిస్తున్న శివకృష్ణ

కుంటాల: గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఎల్‌పీవో శివకృష్ణ అన్నారు. మంగళవారం మండలంలోని కల్లూరులో పారిశుధ్య పనులను పరిశీలించారు. ఇంటింటా సేకరించిన తడి,పొడి చెత్తను పంచాయతీ ట్రాక్టర్‌లో డంపింగ్‌యార్డ్‌కు తరలించాలన్నారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. వారి వెంట సర్పంచ్ పద్మాబాయి, పంచాయతీ కార్యదర్శి శ్రావణ్ తదితరులు ఉన్నారు.

పరామర్శ



బాధితులను పరామర్శిస్తున్న మహేశ్వర్‌రెడ్డి

సారంగాపూర్: మండలంలోని బోరిగాం గ్రామంలో కాంగ్రెస్ నాయకుడు ఏనుగు ముత్యంరెడ్డి తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. మంగళవారం బాధిత కుటుంబసభ్యులను ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ చైర్మన్ ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పరామర్శించారు. వారి వెంట కాంగ్రెస్ నాయకులు దశరథ రాజేశ్వర్, పోతన్న, సాహెబ్‌రావు, తదితరులు ఉన్నారు.

దివ్యాంగులకు ఫిజియోథెరపీ



పరీక్షిస్తున్న వైద్యులు శ్రీనివాస్

తానూరు: మండల కేంద్రంలోని భవిత విద్యావనరుల కేంద్రంలో మంగళవారం దివ్యాంగులైన విద్యార్థులకు ఫిజియోథెరపీ నిర్వహించారు. 23మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందించినట్లు ఫిజియోథెరపిస్ట్ శ్రీనివాస్ తెలిపారు. ప్రతి మంగళవారం కేంద్రంలో నిర్వహించే వైద్యశిబిరం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఐఆర్‌టీ భూమన్న, రాము సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వారసంత వేలం

కుంటాల: కుంటాల వారసంత నిర్వహణకు వేలంపాటను మంగళవారం సర్పంచ్ సమత ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామానికే చెందిన ఒడ్నం గంగాధర్(ఆటో)రూ.19,500కు దక్కించుకున్నారని పంచాయతీ కార్యదర్శి రాజబాపు తెలిపారు.

నర్సరీల్లో చలువ పందిళ్లు

- మొక్కల రక్షణకు పకడ్బందీ చర్యలు
- ఎండిపోకుండా తరచుగా నీటి తడులు
- ఎప్పటికప్పుడు అధికారుల పర్యవేక్షణ



లోకేశ్వరం నర్సరీలో ఏర్పాటు చేసిన షేడ్‌నెట్



ధర్మోరలో షేడ్ నెట్ కింద పెరుగుతున్న మొక్కలు

లోకేశ్వరం: హరితహారంలో భాగంగా గ్రామపంచాయతీకో నర్సరీ ఏర్పాటు చేసి మొక్కలు పెంచుతున్నారు. వీటి పర్యవేక్షణ బాధ్యత ఆయా గ్రామ పంచాయతీలకే అప్పగించారు. వర్షాకాలంలో నాటేందుకు ప్రతి నర్సరీలో 11 వేల మొక్కలు పెంచాలని అధికారులు నిర్దేశించారు. వేసవి కావడంతో మండలంలోని అన్ని నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా షేడ్‌నెట్(చలువ పందిరి) ఏర్పాటు చేశారు. ఇళ్లతోపాటు రోడ్లకు ఇరువైపులా, చెరువు కట్టలపై, కార్యాలయాలు, పాఠశాలల్లో నాటేందుకు పూలు, పండ్లు, నీడనిచ్చే మొక్కలను పెంచుతున్నారు.

మొక్కలు ఎండిపోకుండా చర్యలు..

నర్సరీల్లో నాటిన ప్రతి విత్తు మొలకెత్తడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నారు. కవర్లలో ఎర్రమట్టి, రేగడిమట్టి పొడి, ఇసుకతోపాటు సెగ్రిగేషన్ షెడ్డులో తయారైన సేంద్రియ ఎరువు, సూపర్‌ఫాస్ఫేట్‌ను కలిపి గింజలు నాటుతున్నారు. కొన్ని మొక్కల కొమ్మలను కత్తిరించి నాటుతున్నారు. తరచుగా కలుపు నివారణ చర్యలు చేపడుతున్నారు. ఏపుగా పెరిగిన మొక్కలను పెద్ద కవర్లలోకి మారుస్తున్నారు. మొలకెత్తని గింజలను తొలగించి మళ్లీ కొత్తవి నాటుతున్నారు.

తరచుగా నీటి తడులు..

ప్రస్తుతం ఎండలు తీవ్రం కావడంతో నర్సరీల్లో మొక్కలు వాడిపోకుండా షేడ్‌నెట్ ఏర్పాటుతోపాటు నీటి తడులు అందిస్తున్నారు. వాటి సంరక్షణకు గెమాగ్జిన్ పౌడర్ చల్లుతున్నారు.

అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేశాం



మండలంలోని 25 గ్రామ పంచాయతీల్లో 2లక్షల 75 వేల మొక్కలు పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. మండలంలోని అన్ని గ్రామాల నర్సరీల్లో షేడ్‌నెట్లు ఏర్పాటు చేశాం. ఎప్పటికప్పుడు కూలీలతో కలుపు తీయిస్తున్నాం. నీటి తడులు అందిస్తున్నాం.

– జగన్నాథ్, ఏపీవో, లోకేశ్వరం

రోజూ పరిశీలిస్తున్నాం



తొమ్మిదో విడత హరితహారంలో భాగంగా వర్షాకాలంలో గ్రామాల్లో మొక్కలు నాటేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా రోజూ పరిశీలిస్తున్నాం. ఎప్పటికప్పుడు సిబ్బందికి అవసరమైన సలహాలిస్తున్నాం.

–సల్మాన్‌రాజ్, ఎంపీడీవో, లోకేశ్వరం

ప్రజాసమస్యలు సత్వరం పరిష్కరించండి

- నర్సాపూర్(జి) మండల సర్వసభ్య సమావేశంలో జెడ్పీటీసీ చిన్నరామయ్య



మాట్లాడుతున్న జెడ్పీటీసీ చిన్నరామయ్య

నర్సాపూర్(జి): ప్రజాసమస్యలపై అధికారులు, పాలకులు సత్వరం స్పందించి పరిష్కరించాలని జెడ్పీటీసీ చిన్నరామయ్య సూచించారు. మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో మంగళవారం ఎంపీపీ కొండ్ర రేఖ అధ్యక్షతన నర్సాపూర్(జి) మండల సర్వసర్వ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి జాదవ్ సాయికిరణ్ మాట్లాడుతూ అర్హులందరి బ్యాంకు ఖాతాల్లో రైతుబంధు జమ చేశామన్నారు. కొత్తగా నమోదు చేసుకున్న రైతులకు రైతుబంధు రావడం లేదని గొల్లమాడ గ్రామ సర్పంచ్ చెన్న మహేశ్ అనడంతో త్వరలో జమవుతాయి ఏవో సమాధానం ఇచ్చారు. పోషణ్ పక్వాడలో భాగంగా అంగవాడీ కేంద్రాల్లో గర్భిణులు, చిన్నారులకు చిరుధాన్యాలు, పోషకాహారంపై అవగాహన కల్పించామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రజనీదేవి పేర్కొన్నారు. ఉద్యానవన శాఖ అధికారి జావిద్ పాషా మాట్లాడుతూ మండల రైతులు ఆయిల్‌పాం సాగుకు ఆసక్తి చూపుతున్నారని.. వారికి త్వరలో సబ్సిడీ అందుతుందని పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో తొలి కాన్పు నార్మల్ డెలివరీ అయ్యేలా ఆసుపత్రి అధికారులు చర్యలు తీసుకోవాలని సభ్యులు కోరారు. కార్యక్రమంలో బన్సపల్లి పీఏసీఎస్ చైర్మన్ రమణారెడ్డి, ఎంపీడీఓ అల్లాడి వనజ, తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీఓ శ్రీనివాస్‌గౌడ్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు అండగా ప్రభుత్వం

- ఎమ్మెల్యే రేఖానాయక్



సుర్జాపూర్‌లో చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

ఖానాపూర్: అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. మంగళవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణతోపాటు సుర్జాపూర్, పాతఎల్లాపూర్, బీర్నంది, రాజురా గ్రామాల్లో పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. వేర్వేరుగా జరిగిన ఆయా కార్యక్రమాల్లో అంకం రాజేందర్, ఖలీల్, అనురాధ, అంబటి స్వప్న, సువర్ణ, వాల్‌సింగ్, శ్రీనివాస్, వెంకాగౌడ్, రామునాయక్, శ్రావణ్, సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవాలి

కుంటాల: ప్రభుత్వ స్థలాల క్రమబద్ధీకరణకు మీసేవ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తహసీల్దార్ కలీం తెలిపారు. అసైన్డ్, అభ్యంతరం లేని ప్రభుత్వ భూములను 02.06.2020 లోపు ఆక్రమించుకున్న ఇంటి స్థలం, ఖాళీ స్థలాల క్రమబద్ధీకరణకు ఈనెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

పర్యావరణంపై అవగాహన



వెంకటేశ్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని జిల్లా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం ప్రకృతి–పర్యావరణం అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వేసవికాలం నేపథ్యంలో పక్షులు, పశువులు, మొక్కలకు నీరు అందించాలన్నారు. బర్డ్ ఫీడర్లను ఏర్పాటు చేసి పక్షులకు ఆహారం అందించాలని పక్షి ప్రేమికుడు జక్కుల వెంకటేష్, సహాయకుడు రమణ సూచించారు. పాఠశాల ఆవరణలో పక్షుల కోసం నీటి తొట్టె, ఫీడర్లను ఏర్పాటు చేశారు. అనంతరం వెంకటేశ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాజేంద్రకుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలలకు యూనిఫాం

కుభీర్: మండలంలోని సర్కారు బడుల్లోని విద్యార్థులకు వచ్చే విద్యాసంవత్సరం కోసం ప్రభుత్వం యూనిఫాం సరఫరా చేసిందని ఎంఈవో చంద్రకాంత్ తెలిపారు. మొత్తం 68 పాఠశాలల్లో 3900 మంది విద్యార్థులు ఉన్నారని తెలిపారు. ఆయా పాఠశాలలకు యూనిఫాం పంపి దర్జీతో కుట్టించి పిల్లలకు దుస్తులు అందిస్తామని పేర్కొన్నారు.

ఆధ్యాత్మిక భావనలతోనే సన్మార్గం



పూజలు చేస్తున్న మహరాజ్

ఖానాపూర్: చెడు వ్యసనాలకు దూరం ఉండి ఆధ్యాత్మిక భావనలతో సన్మార్గంలో పయనించాలని కైలాస్‌టెక్డికి చెందిన శ్రీసంత్ లింబా మహరాజ్ అన్నారు. పట్టణంలోని పంచముఖ హనుమాన్ విగ్రహం వద్ద పెంబి జెడ్పీటీసీ జానుబాయి రమేశ్ దంపతుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేసి భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో అల్లాడి వెంకటేశ్వర్లు, పడాల ప్రభాకర్, పెరిక గంగాధర్, దాడిశెట్టి కృష్ణ, మడిగెల గంగాధర్, పడాల రాజశేఖర్, మదిరె శ్రీనివాస్, అనిల్‌రావు, దేశాయ్‌రాము, విలాస్, తుమ్మనపెల్లి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



'హరిత' సోయగం

లక్ష్మణచాంద సమీపంలో..



పొట్టపెల్లి వెళ్లే మార్గంలో..



కనకాపూర్‌లో..

లక్ష్మణచాంద: హరితహారంలో భాగంగా మూడేళ్ల కిందట నాటిన మొక్కలు ప్రస్తుతం ఏపుగా పెరిగి ఆహ్లాదం పంచుతున్నాయి. అటవీశాఖ ఆధ్వర్యంలో మండలంలోని కనకాపూర్ నుంచి లక్ష్మణచాంద వరకు డబుల్ రోడ్డుకు ఇరువైపులా రెండు వేల వరకు మొక్కలు నాటారు. ఐదు కిలోమీటర్ల మేర నాటిన మొక్కలు నేడు చెట్లుగా ఎదిగి నీడనిస్తున్నాయి. ఈమార్గంలో రాకపోకలు సాగించేవారితోపాటు రోడ్డు పక్కన పొలాలున్న రైతులు ఈ చెట్ల కింద సేదతీరుతున్నారు.

బొప్పారంలో 'బలగం' ప్రదర్శన



సినిమా వీక్షిస్తున్న గ్రామస్తులు

లక్ష్మణచాంద: సోన్ మండలం బొప్పారం గ్రామంలో సర్పంచ్ హరితరెడ్డి ఆధ్వర్యంలో బంధాల విలువ తెలియజేప్పే బలగం సినిమా ప్రదర్శించారు. గ్రామంలోని హనుమాన్ ఆలయ ఆవరణలో ఏర్పాటు చేయగా చిన్నారుల నుంచి వృద్ధుల వరకు భారీగా తరలివచ్చారు. సినిమా చూసిన వారిలో పలువురు తమ బంధువులను గుర్తు చేసుకొని కంటతడి పెట్టారు.

అటెన్షన్ ప్లీజ్.. రోడ్డుకు మరమ్మతు చేపట్టండి



తానూరు: మండలంలోని ఉమ్రి(కే) నుంచి ఇలేగాం గ్రామానికి వెళ్లే మార్గంలో వంతెన వద్ద వరదతో రోడ్డు కోతకు గురై ప్రమాదకరంగా మారింది. దీంతో వాహనదారులు అదుపు తప్పి కింద పడుతున్నారు. అధికారులు మరమ్మతు చేపట్టి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: జగదీశ్, పీఆర్ ఏఈ, ఫోన్ : 91211 35623

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభిస్తున్న సర్పంచ్ విఠల్

తానూరు: మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో మంగళవారం సర్పంచ్ తాడేవార్ విఠల్ చలివేంద్రం ప్రారంభించారు. ప్రయాణికుల దాహార్తి తీర్చడానికి పంచాయతీ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పుండలిక్, నాయకులు పండరీ తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడి జ్ఞాపకార్థం..



నీటిని అందిస్తున్న బాల్యమిత్రులు

లోకేశ్వరం: మండలంలోని రాయపూర్‌కాండ్లీకి చెందిన సమీర్‌బేగ్ నవంబరు మాసంలో జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో మరణించాడు. అతడి జ్ఞాపకార్థం ఆయన బాల్యమిత్రులు గ్రామంలోని బస్టాండ్ ప్రాంతంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. శ్రీకాంత్, సందీప్, స్వరాజ్, బబ్లూ, నవీన్, నితిన్, శంకర్, దేవేందర్, భోజన్న పాల్గొన్నారు.

రైతుబజార్‌లో..

కూరగాయలు	కిలో(రూ.లో)
టమాటా	15
వంకాయ	50
బెండకాయ	40
పచ్చిమిర్చి	60
కాకరకాయ	50
బీరకాయ	70
క్యారెట్	100
గోరుచిక్కుడు	60
కొత్తిమీర	120
అల్లం	50
ఎల్లిగడ్డ	60
ఉల్లిగడ్డ	20
ఆలుగడ్డ	20

- నిర్మల్‌టౌన్

సినిమాలు



తిరుమల : దసరా

నారాయణ: బలగం

కొండగట్టుకు హనుమాన్ దీక్షాపరులు



పాదయాత్రగా బయలుదేరిన స్వాములు

లక్ష్మణచాంద: మండల కేంద్రానికి చెందిన పలువురు హనుమాన్ దీక్షాపరులు మంగళవారం కొండగట్టుకు బయలుదేరారు. లక్ష్మణచాంద నుంచి భద్రాచలం, కాళేశ్వరంలో దర్శనం చేసుకొని హనుమాన్ జయంతి రోజున కొండగట్టుకు వెళ్లనున్నట్లు స్వాములు తెలిపారు. ఇందులో జెడ్పీటీసీ రాజేశ్వర్, స్వాములు ఈటెల శ్రీనివాస్, మల్లేశ్, రమేశ్, భూమన్న, రవి, సాయారెడ్డి తదితరులు ఉన్నారు.

దస్తురాబాద్: మండల కేంద్రానికి చెందిన హనుమాన్ స్వాములు మంగళవారం కొండగట్టుకు పాదయాత్రగా బయలుదేరారు. ఈనెల 6న హనుమాన్ జయంతిని పురస్కరించుకొని మండల దీక్ష పూర్తి చేసుకున్న స్వాములు పాదయాత్రగా వెళ్లారు.



'పరిహాసం' గా పర్యాటకం



జిల్లా కేంద్రంలో గోదావరి నది ఒడ్డున ఉన్న శ్యామ్‌గఢ్ ముందు పర్యాటకుల కోసం తెలంగాణ టూరిజంశాఖ ఆధ్వర్యంలో రూ.లక్షలు వెచ్చించి హరిత హోటల్ అండ్ రిసార్ట్స్ నిర్మించారు. అయితే గతేడాది ప్రైవేటు వారికి వీటిని అప్పగించగా కొద్ది రోజులకే మూతపడింది. ప్రస్తుతం ఈ హరిత హోటల్ మందుబాబులకు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. టూరిజంశాఖ అధికారులు స్పందించి వీటిని అరికట్టాలని పర్యాటకులు కోరుతున్నారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్